# సిగ్గు

పెళ్ళిచూపులు జరుగుతున్నాయి. పెళ్ళికూతురు పెళ్ళికొడుకు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. సిగ్గుతో చితికి, తలలు వాల్చేసుకున్నారు.

● సిగ్గు మామూలు సిగ్గు కాదు !

కిటికీలకీ, గుమ్మాలకీ కట్టిన అందమైన తెరలు గాలికి రెపరెప లాడుతున్నట్లు వారి మనసులు రెపరెప లాడుతున్నాయి. కాఫీ చేదుగా వుంది. మిక్చర్ కారంగా వుంది.


తీపి తినబుద్ధి కాలేదు. సీలింగ్‌కి తిరుగుతున్న ఫ్యాను. వారి తలలోనే తిరుగుతున్నట్లు ఉంది. అక్కడ ఉన్న కొయ్య కుర్చీల్లా బల్లల్లా బిగిసిపోయి కూర్చున్నారిద్దరూ.

పెళ్ళికూతురి విశాల నయనాలు వాలి వున్నాయి.

పెళ్ళికొడుకు కళ్ళు బెదురు బెదురుగా చూస్తున్నాయి.

పెళ్ళికూతురి తండ్రి—"అమ్మాయి చదువులో చురుకు. బొమ్మలు వేస్తుంది. మిషన్ కుడుతుంది. చక్కగా బట్టలు ఇస్త్రీ చేస్తుంది, మంచి బుద్ధిమంతురాలు, అన్నింటిలోనూ ఫస్టు మార్కులే. నా పిల్లని నేను పొగడ కూడదనుకోండి" అని ఆపాడు.

"అమ్మాయి చదువుకున్న సంప్రదాయమైన పిల్ల. చక్కగా ఇంటి పనీ, వంట పనీ చేస్తుంది. నాలా చాదస్తంగా పనులు చేయదు. చకచకా ఇట్టే చేసి పారేస్తుంది. పని చేసినట్లే వుండదు. లేసులు, అల్లికలు కూడా వచ్చండీ. ఊరగాయలు, చక్కగా పెడుతుంది. ఇది వచ్చు. అది రాదు అని లేదనుకోండి" అంది తల్లి.




వారిద్దరి మాటలూ వింటుంటే సత్యకి ఎడాపెడా ఎవరో కొరడాతో కొడుతున్నట్లు అనిపించింది. అక్కడ నుంచి లేచి పారిపోవాలనిపించింది. తలిదండ్రులమీద జాలితో లేవలేకపోతోంది.

వారి మాటలు, పెళ్ళి కొడుక్కి బూంది మీద చల్లగా మిగిలిన కారం తన మీద చల్లుతున్నారా అనిపిస్తోంది. కూర్చోటం కష్టంగా వున్నా తలిదండ్రుల ముఖంచూసి కూర్చుండిపోయాడు.

పెళ్ళికూతురు తలెత్తిందిగాని, అతనికేసి చూడ్డంలేదు.

పెళ్ళికొడుకు కాస్త తల దించుకున్నాడు గాని ఆమెనే పరిశీలనగా చూస్తున్నాడు.

పెళ్ళికొడుకు తల్లి పిల్లని చూసి మురిసిపోతోంది. "పాటలు వచ్చాండి అమ్మాయికి?" అని భయంభయంగా అడిగింది.

"ఆడపిల్లకి పాట రాకుండా ఉంటుందా? గానసభలు పెట్టిస్తావా? రేడియోలో పాడిస్తావా? నీ పూజదగ్గరకి, నీ పేరంటంలోనూ ఆపాటి పాట పాడకపోదులే—ఊరుకో అమ్మాయిని ఇబ్బందిపెట్టకు" అని కసిరాడు పెళ్ళికొడుకు తండ్రి.

అతని మొదటి మాటలకి చురచురా చూసి, చివరిమాటతో చల్లబడి చిరునవ్వు నవ్వుకుంది సత్య.

"అబ్బాయీ, నువ్వు ఏమైనా అడుగుతే అడుగు. మేమంతా ఉండగా అడగడానికి సిగ్గయితే, మేం ప్రక్కకి తప్పు

కుంటాం" అన్నాడు పెళ్ళికూతురు తండ్రి.

"అబ్బే వద్దండీ. అమ్మాయినే—ఏమైనా అడిగితే అడగమనండి" అన్నాడు ఆ మాటకి.

చురుగ్గా అతనికేసి చూసి తల దించుకుంది సత్య.

పెళ్ళికూతురి అన్నగారు "మొహమాట పడకోయ్ బాబ్జీ?" అన్నాడు.

అవసరంలేదన్నట్టు తల ఊపాడతడు.

పెళ్ళిచూపు లయాయి.

"మీ అమ్మాయి లక్ష్మీ దేవి లా ఉందండీ" అథి సత్య చెంపలు రాసి మరీ ముందుకు నడిచింది పెళ్ళికొడుకు తల్లి.

"త్వరలోనే ఏ విషయము తెలియబరుస్తామండీ" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

టకటకా బూట్లు చప్పుడు చేస్తూ ఆ చప్పుడుతో తన మగతనాన్ని సూచింపచేశాడు బాబ్జీ.

విసురుగా తన నిడుపాటి జడ వెనక్కి విసిరి, వయారంగా ఇంట్లోకి నడిచింది. 'అసలు జయం స్త్రీ త్వానిదే అన్నట్లు'—సత్య.

పెళ్ళివారు వెళ్ళిపోయారు.

పని మనిషి ప్లేటులో మిగిలినవి సర్దుకుంటోంది.

విసురుగా తన గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకుంది సత్య.

'ఏమిటి దీని చిన్నతనం చేష్టలు.?' తల్లీదండ్రీ తెల్లబోయి చూస్తుండగా శేషు ముందుకొచ్చి చెల్లెలి గది తలుపు తట్టాడు.

"అబ్బ! వుండరా? బట్టలు మార్చుకుంటున్నాను." అంది విసుగ్గా. తీరిగ్గా బట్టలు మార్చుకుని తలుపు తీసిందిగాని మనసు అల్లకల్లోల జలధిలా ఉంది. మనసులో లేచి పడుతున్న ఆలోచనా తరంగాల్ని ఏ ఒడ్డుకు చేర్చాలో బోధపడక అయోమయంగా వుంది. తనువు గాలిలో, లేతీగలా అల్లాడుతోంది.

శేషు లోపలికొచ్చాడు. మంచంమీద కూర్చున్నాడు.

చెల్లెలి చెయిపట్టి తన పక్క కూర్చోబెట్టుకున్నాడు.

"చెల్లీ పిల్లాడు బాగున్నాడా?"

"బాగున్నాడు."

"నచ్చాడా?"

క్షణం ఆగి ఊపిరి తీసుకుంది.

"నచ్చాడు."

"మరయితే పెళ్ళిసంబంధం నిశ్చయం చేయమంటావా?"

"వద్దు."

తెల్లబోయి చూశాడామాటకి.

"అదేంటే, నచ్చాడన్నావు. బాగున్నాడన్నావు, చాలా మంచి కుర్రాడు. బేంకిలో ఉద్యోగం. ఆస్తి, మేడ అన్నీ వున్నాయి. బోలెడు కట్నమిస్తామని ఎందరో అమ్మాయిల్ని చూపిస్తున్నారట. కాని అతనికెవరూ నచ్చటం లేదుట. పెద్ద కళ్ళు, పెద్ద జడ వున్న అమ్మాయి కావాలంటున్నాడట. అవి రెండూ నీ కున్నాయి. కాస్త రేటు తగ్గచ్చు."

"చాలించు. నేనా అబ్బాయిని చచ్చినా చేసుకోను."

"ఎందుకట? అతన్ని గురించి ఏమైనా



చెడు విన్నావా?" కిట్టనివాళ్ళు ఏమైనా చెబుతారు. అయినా మగపిల్లలు చిన్నతనంలో ఏవో సరదాలు పోతారు గాని పెళ్ళయాక చాలా బుద్ధిగా మారిపోతారు. అతనిలో స్వల్ప లోపాలుంటే సరిదిద్దుకోవడం నీ తెలివిమీద ఆధారపడి వుంటుంది. ఈ సంబంధం వద్దనకు సత్యా" అన్నాడు బుజ్జగింపుగా.

"ఒరేయ్. నాకేం చెప్పవలసిన పని లేదు. నే నన్నీ ఆలోచించుకోగలను. చచ్చినా నేనీ సంబంధం చేసుకోను. ఎందుకని అడక్కు. అదంతే."


"ఏంటిరా గొడవ. ఆడపిల్లని అడగవలసినది నువ్వేనేమిటి? కుర్ర సన్యాసివి. లే బైటికి నడు. ఇలా రామ్మా సత్యా" అని తల్లి గదిలోకొచ్చి సత్య చెయి పట్టుకుని వంటింటిలోకి లాక్కువచ్చింది. పీట మీద కూర్చోబెట్టింది. పిల్ల ఫలహారమేమీ చేయలేదని తెలుసు. సత్యకి భోజనం కంటె టిఫెన్ బాగా ఉండాలి.బూంది నచ్చదు. పకోడీలు కావాలి!

గబగబా నాలుగు ఉల్లిపాయలు తరిగి బూంది చేయగా మిగిలిన పిండిలో మరి కాస్త సెనగపిండి కలిపి పకోడీలు చేసి ప్లేటులో నిండుగా పెట్టి అందించింది. బోరన్‌వీటా కలిపి ఇచ్చింది.

పకోడీల ప్లేటంతా కాళీ చేసింది సత్య. బోరన్‌వీటా తాగింది.

తల్లి ఆదరణతో కాస్త కుదురుపడింది సత్య.

"అమ్మా సత్యా! అబ్బాయి చాలా అందంగా ఉన్నాడు కదూ"? లాలనగా తల్లి అడుగుతుంటే కళ్ళల్లోనీళ్ళు చిప్పిలాయి.



సిగ్గుతో తల వాలిపోయింది. తనని, తన చిలిపితనాన్ని-మనసులో తెగ తిట్టి పోసుకుంది.

"అవునమ్మా బాగున్నాడు."

"మరెందుకు వద్దంటున్నావ్? అందమైన అబ్బాయి కోసం కదా ఇన్నాళ్ళు చచ్చేట్లా వెదుకుతున్నది. అందం, ఆస్తి, చదువు, ఉద్యోగం అన్నీ బాగున్నాయమ్మా-కాదనకు అవసరమైతే నా పొలం అమ్మైనా కట్నం ఇచ్చి నీకా అబ్బాయిని కొని పెడతాను."

ఆ మాటకి తల్లి కేసి కోపంగా చూసింది.

"ఆ అబ్బాయి వద్దమ్మా" అంది విసుగ్గా.

"మరే అబ్బాయినైనా ప్రేమించావా?"

"మగవాణ్ణా! ప్రేమించడమా?" తల అడ్డంగా తిప్పింది విసురుగా.

"ఈ తల బిరుసు మాటలు మానవే మగాడికి ఆడది, ఆడదానికి మగవాని అండ తప్పదు."

"అండ అనకు అమ్మా. అవసరం అను."

"పో నీ అలాగే మగవాణ్ని కాక ఎవర్ని పెళ్ళాడతావు? ఎవర్ని ప్రేమిస్తావు?"

"పెళ్ళాడతాగాని ప్రేమించనమ్మా!"

"పోనీలే ప్రేమలు వద్దంటున్నావ్, అదీ మంచిదే. పెళ్ళెందుకు వద్దంటున్నావ్?"

"పెళ్ళి వద్దనడం లేదు కాని అబ్బాయి వద్దంటున్నాను."

"ఈ అబ్బాయి ఏమయినా చెడిపోయాడా?"

"అమ్మా ఆ ప్రశ్న నన్నడగవద్దన్నాను, అంతే. ఇహ నన్ను విసిగించకు." అని అక్కడనుంచి లేచి హాల్లోకి వచ్చింది.

"ఇలా పెళ్ళివారు వెళ్ళారో, లేదో అలా దాన్ని సతాయిస్తున్నా రేమిటర్రా! దామ్మా సత్యా హాయిగా అలా బైటకి పోదాం" అని తండ్రి కూతురి చెయి అందుకుని బైటకు షైర్ బయలుదేరదీశాడు.

"మీ గారాబమే దాన్నింతకు తెచ్చింది. కూతురైతే గారాబం పెళ్ళామైతే" — మాట పూర్తి చేయలేక మూతి మూడు వంకరలు తిప్పింది బంగారమ్మగారు.

"చాల్లేవోయ్, లోపలి కెళ్ళి రాత్రివంట చూడు."

ఇదంతా తలనొప్పిగా ఉంది. శేషు చెప్పులు వేసుకుని చకచకా స్నేహితుల్ని కలవడానికి వెళ్ళిపోయాడు. "దాని పెళ్ళి అయితేగాని తన పెళ్ళి అవదు. అది ఏ పెళ్ళికొడుకునీ ఒప్పుకోదు! ఛీ ఆడదాని కింత తలబిరుసేమిటి? మంచి సంబంధం కూడా కాలదన్నుతోంది. ఎవరినైనా ప్రేమించిందో, ఏమిటో ఆరా తీయాలి.

## 2

"పిల్ల నచ్చిందిరా బాబ్జీ?" అని తాపీగా అడిగాడు చిరునవ్వుతో తండ్రి. బంగారపు బొమ్మలా వుంది, పెద్ద జడ, పెద్ద పెద్ద కళ్ళు. వాడు కోరినవి వుండనే వున్నాయి, నచ్చకేం చేస్తుంది అన్న ధీమాతో.

"నచ్చలేదు నాన్నా" అన్నాడు అంత ధీమాగాను.

"ఆఁ!" అని ఆ మాట విని నోరు వెళ్ళబెట్టి చేతిలోపని చక్కా వదిలి ముందు గదిలో కొచ్చింది మాణిక్యమ్మగారు. "ఆ పిల్ల నచ్చకపోవడ మేమిటి, బంగారపు బొమ్మలా లక్ష్మీకళ ఉట్టిపడుతుంటేను."

"పైకికనిపించేవన్నీ నిజంకావమ్మా" అన్నాడు.

"ఏం నిజాలు విన్నావోయ్. ఆడపిల్లలు బైటకి వచ్చి చదువుకొంటుంటే గిట్టని వాళ్ళు అనేక కథలు సృష్టిస్తారు. నోరు మూసుకుని ఒప్పుకో, మాకంటె అనుభవజ్ఞుడివా? మంచి సంప్రదాయం, మంచిపిల్ల. ఒకత్తే ఆడపిల్ల. ముద్దుముచ్చట్లన్నీ తీరుస్తారు. అడిగిన కట్నము ఇస్తారు."

"కట్నానికి కొడుకుని అమ్మేస్తావా నాన్నా?"

"అలా అమ్మాలంటే ఎప్పుడో అమ్మేద్దును. నీకు పిల్ల నచ్చడం కోసమేగా ఇన్ని గుమ్మాలు ఎక్కి-దిగుతున్నది."

"కట్నాల సంగతి నీవు మాట్లాడొద్దు" పిల్ల నీకు నచ్చిందో, లేదో అది అఘోరించు. పిల్ల బాగోలేదా"?

"బాగానే ఉంది."

"మరెందుకు వద్దంటున్నావు: ఎవరినైనా ప్రేమించావా అదైనా చెప్పి అఘోరించు."


"నేనెవర్నీ ప్రేమించలేదు నాన్నా."

"మరయితే ఈ అమ్మాయిని లక్షణంగా పెళ్ళాడు."

"ఈ అమ్మాయి మాత్రం వద్దు నాన్నా."

"ఇన్నాళ్ళు ఈ పిల్ల బాగోలేదుల పిల్ల బాగోలేదు అన్నావు. సరే ఈ పిల్ల అన్ని విధాలా లక్షణంగా వుంది. దీన్ని వద్దంటే మరిహ నేనే సంబంధమూ చూడను. పెళ్ళి చేయను. నీ ఇష్టం వచ్చిన పిల్లని నీ ఇష్టంవచ్చినట్లు పెళ్ళి చేసుకుని నీ ఇష్టం వచ్చిన చోటకాపురం పెట్టుకో. ఇదేనా చివరి నిర్ణయం చివరి మాటాను-" అనేసి కోపంతో మేడపైకి వెళ్ళిపోయాడు—

మాణిక్యమ్మగారు అంతా వింది. ఇంక తను చెప్పవలసిందింకేమీ లేదని



*With Best Compliments from:*
EAST INDIA COMMERCIAL COMPANY PRIVATE LIMITED
LESSEE: SRI KRISHNA JUTE MILLS, ELURU-534 002 (A.P.)
MANUFACTURERS OF All Varieties of Jute Gunny Bags Including D. W. Flour Bags, Cement Bags, B. Twill Bags and A. Twill Bags
and Manufacturers of "KRISHNA" Brand Jute Twine in all Plys and Jute Yarn in Spools & Cops.
Telegrams: "TWINKLE" Telephones: 37 & 441
PMBX: 1122 (5 Lines)
SOUND

పించింది. నిరాశతో వంట ఇంట్లోకి వెళ్ళింది—

"వెధవ వంటా. వెధవ వార్పూను. చచ్చేదాకా నాకు తప్పడం లేదు." గిన్నెలు అటూ, ఇటూ గిరాటు పెట్టింది. డబ్బాలు షెల్ఫు మీంచి దబ్బున క్రింద పడేసింది.

"కూతురు లేదు. కోడలు రాదు ఒరేయ్ అబ్బాయి- మీ నాన్న వంట మనిషిని పెట్ట నియ్యరు. నేనింక వంట చెయ్యలేను. చేయను. ఆడపిల్లలు చదివి ఉద్యోగాలు చేసి సంపాదించగాలేంది మగచచ్చినాళ్ళు వంటచేస్తే తప్పేముంది? నువ్వు. మీ నాన్న ఈ వంట ఇంటిలో చావండి— నా వల్లగాదిహ. ఏం?పురాణాల్లోమాత్రం, నలుడు వంట చేయలేదా, భీముడు చేయ లేదా? మీరేం అంతకంటె మించినవారా? బాబ్జీ నిన్నేరా ఈ పూటే వంటింటిలో ప్రవేశించు. ఎందరు అమ్మాయిలు వంట పనీ. ఇంటిపనీ చేసి, ఉద్యోగాలు చేయడం లేదు? నువ్వంతకంటె ఊడబొడిచావా? పాపం ఈ కాలంపిల్లలు, మరీ పాపం చేసుకున్నారు. మరో నాలుగు పనులు నెత్తిన బడ్డాయి. చదువుకోవాలి, ఉద్యోగాలు చేయాలి. వంట చేయాలి. పిల్లల్ని కనాలి. ఆ తరువాత రామ రామ— నీలాటి పెళ్ళికొడుకుల మాటలు పడాలి—"

తన ఉక్రోషం ఎలా ప్రదర్శించాలో బోధపడక ఇష్టంవచ్చినట్లు మాట్లాడం మొదలుపెట్టింది—"అమ్మా!" అని కొడుకు గట్టిగా అరిచాడు.

"నీ అరుపులు నేనేం లెక్కపెట్టను రోయ్. ఆడ జన్మ దిక్కుమాలినది ఎందుకవాలి. నేను మాత్రం ఇహ వంట చేయను. నువ్వూ మీనాన్నా ఏం అఘోరిస్తారో అఘోరించండి. మంచి పండితుడు శివాలయంలో పురాణం చెబుతున్నాడు అక్కడికి పోతాను" అని చరచరా వంటిల్లు తరువాత గది— ఆ తరువాత ముందుగది దాటి వీధిలోకెళ్ళిపోయింది మాణిక్యమ్మగారు.

## 3

"వద్దే సుగుణా నేనింక ఆ షోకి చచ్చినా రాను. తొలి అనుభవమే నాకు చాలా ప్రమాదం తెచ్చిపెట్టింది. మన సమాజం పిసరంత కూడా మారలేదు. మన చిలిపి పనులు ప్రాణం మీదకు తెస్తున్నాయి. మన కబుర్లు, ఆశయాలు. గాలికి తప్ప. మనుషులకి, మనం బ్రతుకుతున్న సమాజానికి ఎంత మాత్రం పనికి రావు."

"ఆరంభలోనే హంస పాదా? మన ఆశయాలకి మనమే దెబ్బకొడితే ముందడగు వేయడం ఎట్లా?."

"ఎట్లాగో నాకు తెలియదుగాని ఇంట్లో మాత్రం కాదు."

"పోదూ నీ పిరికితనము నువ్వూను" అని బలవంతాన్న సత్యని సుగుణ ఆ ఇంట్లోకి లాక్కెళ్ళింది.

సత్యకి గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది, చాలా కష్టంగా వుంది. దాని కూడా వెళ్ళకపోతే అదేం గొడవ లేవదీస్తుందో?మరోసారి రమ్మన్నప్పుడు ముళ్ళమీద బట్టలా దీని స్నేహం తప్పించుకోవాలి. ఎంత ప్రమాదం వచ్చిపడింది తనకి?

కొన్ని గంటలు గడిచాయి, ఇద్దరూ తెల్లమల్లె పుష్పాల్లా తయారయారు. రూమ్‌లోంచి ముందు గదిలోకి,ముందుగా సుగుణ అతి కొద్దిగా తెర తొలగించి చూసింది. అంతే మెరుపు కొట్టినట్లయి కళ్ళు చీకట్లు కమ్మాయి, ఆమె గుండె గుభేలుమంది. చేతులు గుండెలమీద వేసుకుని.కాళ్ళు గజగజా వొణుకుతూంటె అప్రయత్నంగా వెనక్కి ఓ అడుగు వేసి-"సత్యా: మీ అన్నయ్యేవ్" అంది. మెల్లిగా అన్నాననుకుందిగాని-ఆ మాట కావలసిన ధ్వనినే పుట్టించి చేరవలసిన వారికే చేరింది.

ఆ మాట వింటూనే చేతిలో మల్లె చెండు చటుక్కున విసిరేసి-చరచరా గది దాటి దారికడ్డం వచ్చినవన్నీ తన్నుకుంటూ దొడ్డిగుమ్మం వైపు పరుగు తీసింది. సత్య.

ముందు గది తలుపు మూసేసి పక్క మీద వాలిపోయింది సుగుణ. శేషు బ్రరచాలా చురుకైనది-అదాటుగా లేచి చకచక వీధిలో పడ్డాడు. శేషు అలా ఎందుకు వెళ్ళిపోయాడో తోచక ముందు గదిలో తల పట్టుకు కూర్చున్నాడు శేషు స్నేహితుడు.

చకచక వీధివైపు నుంచి దొడ్డివైపుకు వచ్చేశాడు శేషు.

దొడ్డి తలుపు తీసి నాలుగడుగులు వేసి

రోడ్డెక్కిన చెల్లి చెయ్యిని బలంగా పట్టుకున్నాడు.

నిలువునా కంపించిపోతూ చెయి లాక్కోబోయింది సత్య.

"సత్యా! కంగారుపడకు, పద బీచికి పోయి మాట్లాడుకుందాం" అని పట్టువదలకుండానే ఆటో ఎక్కించి బీచికి లాక్కొచ్చాడు.

బీచిలో ఆమెను కుదేసి తాను ఆమె ప్రక్కన చెయి వదలకుండా గట్టిగా పట్టుకుని కూర్చున్నాడు. మరో చేత్తో జేబురుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు.

శరీరమంతా ముచ్చెమటలు పోస్తున్నాయి. గుండె ఆగిపోతుందా అన్నంత వేగంగాకొట్టుకొంటోంది. మనసు తుఫాను నాటి సముద్రంలా అల్లకల్లోలమై శరీరం గజగజా వణికిపోతోంది. అయినా చురుగ్గా ఆలోచిస్తోంది సత్య-'అన్నకేం చెప్పాలా' అని.

"ఆ ఇంటి కెందు కొచ్చావ్ సత్యా?" అన్నాడు కఠినంగా.

"నువ్వెందు కొచ్చావ్" అంది బింకంగా.

"మగవాణ్ని అనేక అవసరాలుంటాయి."

"ఆడవాళ్ళ కుండవా?"

విస్తుపోయి చూశాడా సమాధానానికి-సత్య అలా అంటుందని ఊహించలేదు సత్యని నిలేసి తిట్టి కొట్టి వారించి లాభం లేదు. నెమ్మదిగానే సమాచారం రాబట్టాలి అని మనసులో అనుకొని-లేని శాంతాన్ని తెచ్చిపెట్టుకున్నాడు. గుండెల నిండా గాలి పీల్చి వదిలాడు. ముందుకు పడుతున్న జుట్టును వెనక్కి తోసుకున్నాడు. కోపాన్ని అణుచుకోవడానికి సముద్ర కెరటాలకేసి క్షణకాలం చూస్తూ కాలం గడిపాడు. ఆ తరువాత చల్లబడ్డాడు. ప్లేటు మార్చాడు.

"సత్యా ఆ ఇల్లు ఎటువంటిదో తెలుసా?" ఆమె తల నిమురుతూ ముంగురులు సర్ది అన్నాడు.

సత్య చిన్నగా మనసులో నవ్వుకుంది అమాయకతనటిస్తూ "తెలియదన్నయ్యా"

"మరెందు కొచ్చావ్?"

"సుగుణ తీసుకొచ్చింది."

"అలా ఎవరితో బడితే వారితో ఎక్కడికి బడితే అక్కడికి వెళ్ళొచ్చా?"

"సుగుణ నా స్నేహితురాలేకదా అన్నయ్యా.


"స్నేహితురాలే కావచ్చు. పేరుల్లో వున్న సుగుణాలు మనుషుల్లో వుండవమ్మా!"


"సుగుణ చెడ్డదంటావా?"

"అనడంలేదు. ఆ ఇల్లు మంచిదికాదు. ఆ ఇంటావిడకి బోలెడుమంది సంతానం. వాళ్ళని సాకలేక అప్పులుచేసి ఆ మొగుడు పత్తాలేకుండా పారిపోయాడు."

"ఆవిడ స్టీలుసామాన్లు, నేతచీరలు అమ్ముకొని సంసారం గడుపుకుంటోంది. తప్పా?" అని ప్రశ్నించి అన్నగారి మాట పూర్తి చేసింది.

"అంతే నీకు తెలుసు. ఆవిడ వయసులో వున్న కాలేజీఅమ్మాయిల్ని, అబ్బాయిల్ని చేర్చి, వాళ్ళ అవసరాలు తీర్చుకోనిచ్చి, వాళ్ళ బలహీనతల్ని తను డబ్బుగా




మార్చుకుంటోంది. నువ్వు స్నేహితురాళ్ళతో తిరగొచ్చుగాని ఎక్కడికిబడితే అక్కడికి వెళ్ళకూడదు తెలిసిందా?" అన్నాడు గంభీరంగా ఆజ్ఞాపిస్తున్నట్లు.

"తెలిసిందన్నయ్యా!ఆ జాగా ఇలాంటిదని తెలియదు" అంది అమాయకంగా ముఖంపెట్టి.

చెల్లెలి కళ్ళల్లోకి చురుగ్గా చూస్తూ—

"ఈ చీర ఎప్పుడు కొన్నావ్" అన్నాడు. తెలియదా రాస్కెల్ అన్నట్టు వినిపించిందా మాట సత్యకు.

కత్తిలా గుండెల్ని కోసిందా మాట. తలలో మెరుపులా ఒక ఆలోచన దూసుకుపోయింది. నువ్వు కోసిన నా గుండెల్లో మాట రాదోయ్ అనుకుంది.

"ఇదా ఆవిడ చీరలమ్ముతుంది కదూ? ఈ చీర బాగా వుంది తీసుకో అంది సుగుణ. అబ్బే బాగా లేదే. తెలుపంటె నా కిష్టంలేదు అన్నాను. 'కట్టిచూడు'ఎంత బాగుంటుందో అంది. కట్టి వాళ్ళ గదిలో అద్దంలో చూసుకున్నాను. బాగుంది నిజంగా. అమ్మకి చూపిద్దామని వస్తున్నాను."

శేషుకి కోపం కట్టలు తెంచుకొంటోంది-దానినాపి నవ్వుతూ- ఆమె బుగ్గమెలి పెట్టాడు. దొంగభడవా అని మనసులో అనుకుంటూ. "ఒరేయ్ నా బుగ్గలు ముట్టుకోకు" అని తాను నవ్వుతూ అన్నగారి చెయ్యి విసురుగా తోసేసించి.

ఇద్దరూ ఇసుకలో నడుస్తూ ఇంటిదారి పట్టారు.

"అయితే అన్నయ్యా ఆ ఇల్లుమంచిది కాదని తెలిసే నువ్వెందు కొచ్చావు అంది" నవ్వు పెదిమిమీద అదిమిపెట్టి.


# నయన గోళం

సముద్రం- పిల్ల నదుల్ని చేరదీసి
కసాయి నేలలకు అమ్మేస్తూంది.
'కళ్ళ' పంపిన అశ్రుపతంగాలు పోయి
ఆకాశానికి 'విన్నపాలు' చేసు
కొంటూంటే-
గాలి గూర్ఖాను పిలిచి
మెడబట్టి గెంటిస్తూంది.

'మేఘం కోడి'-
'గగనం గ్రద్ద' కాళ్ళలో చిక్కి,
ఏడుస్తూంటే
నివ్వెరపోయి చూస్తూంది
భూమి చల్లబడి-
ఇందాకా ఐక్యంగా ఉన్న పక్షులు
'వడిసెల' విసిరిన రాయికే
తలో దిక్కుకు ఎగిరిపోతున్నాయి.

గర్భవతైన రాత్రి
'గవ్వల్ని' కంటూనే వుంది.
బుద్ధి-పిదేలుకు
దారపోగులను కట్టి,
'దీపకరాగం' వాయించాలని
తంటాలుపడుతూంది.
-ఇప్పుడీ నయన గోళం-
'అక్షరాల పెట్రోలు' వ్రాసి,
భగ్గుమనడానికి సిద్ధంగా వుంది.

—దాసరాజు రామారావు.







"నాకు ముందుతెలియదు. నా స్నేహితు డొకడు అక్కడికి లాక్కువచ్చాడు. తీసు కొచ్చాక చెప్పాడు. ఛీ నేనుండనురా అని లేచి చక్కా వచ్చేశాను."

"ఓహ్! మామంచి అన్నయ్యా"

"ఓహ్! మా మంచి చెల్లీ. చెల్లీ నువ్వే మనుకోనంటే ఓ మాట చెబుతాను వింటావా?"

"ఒహ ఏమిటి లక్షచెప్పు వింటాను."

"నువ్వు పెళ్ళి చేసేసుకుంటే మంచి దమ్మా, మొన్న చూశామే ఆ సంబంధం చాలా మంచిది. ఆ కుర్రాడు చాలా మంచి వాడు. చాలా బాగున్నాడుకూడా. ఎందుకొద్దం టున్నావో—"

"ఎందుకయితే ఏం వాడొద్దు."

"పోనీ మరొకరి నెవరినైనా చేసు కుంటావా?"

"ఓ తప్పక" అంది. ఇహ ఏదో ఒక పెళ్ళితప్పదన్నట్లు.

"ఇదివరకులా పేర్లూ, వద్దులూ, పెట్టకూడదు మరి."

"పెట్టను. అసలు పెళ్ళికొడుకును చూడకుండా ఒప్పుకోమన్నా ఒప్పేసు కుంటాను. పెళ్ళికొడుకును నువ్వు చూస్తే చాలు" అంది.

'ఇహ లాభం లేదు దొరికిపోయాను. ఒక ప్రమాదం ముంచుకొచ్చింది.' అని మనసులో అనుకుంది.

"సరే మామంచి చెల్లి"

"సరే మన సంగతులు, నిర్ణయాలు అమ్మానాన్నకి చెప్పకేం?" అంది. బెదురుగా.

"అంత వెర్రివెధవననుకున్నావా? నీ మీద ఆపాటి ప్రేమలేదనుకున్నావా" అన్నాడు పైకి. మనసులోపల నీ రోగం కుదురుస్తాలే అనుకున్నాడు.

* * *

వైభవంగా పెళ్ళితంతు జరుగుతోంది. సత్య పట్టుచీరకట్టి బుట్టబొమ్మలా బుట్టలో కూర్చుని, గౌరీదేవి బొమ్మకి పూజ చేస్తోంది.

పూజ ముగిసింది.

పురోహితుడు "ముహూర్తం సమీపి స్తోంది చప్పున తీసుకురావాలి పెళ్ళి కూతుర్ని" అని అరుస్తున్నాడు.

బంధు మిత్రులతో పెళ్ళిహాలంతా కిట కిటలాడుతోంది.

ముగ్గురు మేనమామలూబుట్ట మోస్తూంటే ఎదురుగా ఫొటో ఫ్లాష్. మొహానికి మెరుపుకొడుతుంటే నవ్వుకుంటూ సిగ్గుతో ముడుచుకుపోతూ బుట్ట సవారీలో హాల్లో కొచ్చింది సత్య.

బుట్ట దింపారు. పెళ్ళి తంతు జరుగు తోంది.

పెళ్ళి కొడుక్కీ-పెళ్ళి కూతురికీమధ్య దట్టమైన పంచె అడ్డుగా పట్టుకున్నారు.

కాళ్ళు కడగడాలు, కన్యాదానమూ అయింది.

జీలకర్ర, బెల్లం, ఒకరి నెత్తి మీద ఒకరు ఉంచడం.

తెర తీయబడటం, ఒకరి ముఖం ఒకరు చూసుకోవడం- అన్నీ క్షణంలో జరిగిపోయాయి.


ఇద్దరికీ గుండె లయ తప్పింది—

ఒకరి నెత్తి ఒకరు మొత్తుకున్నారా అనిపిస్తోంది. తల తిరుగుతున్నట్లుగా ఉంది సత్యకి. పెద్దలు, పురోహితులు, మంత్రాల మధ్య వారి చేతులు నెత్తిమీద నుంచితప్పిపోకుండా, జీలకర్ర, బెల్లం జారి పోకుండా గట్టిగా అదిమి వుంచాడు.

పెళ్ళికొడుకు మధురంగా నవ్వాడు.

'ఏం జరిగింది ఎంత పని చేశాడు అన్నయ్య. ఎంత జాగ్రత్తలు తీసు కున్నాడు. తను అతని మాట ప్రకారం చేసింది. అతడు తనని వంచించాడు నేర్పుగా. దిక్కు మాలింది బాబ్జీ అనడమే గాని అతని పేరు మాధవరావు అనికూడా తనకి తెలియదు! అందుకే శుభలేఖలూ తనని దగా చేశాయి. అసలు ఏ పనీ తను ఆలోచించకుండా చేయడంవల్లే ఇన్ని తిప్పలు వచ్చింది. పారిపోవాలని ఉన్నా, ఇంతమందిలో అది అసంభవం.'

సత్య మనసు 'ఏం జరగనున్నది?' అని







నానా భీభత్సంగాను ఉంది. ఏం చేయ డానికీ పాలుపోవడం లేదు. ఇంక తను చేసేదేమీ లేదనిపిస్తోంది. అన్నయ్య ఎంత మోసం చేశాడు! ఇంక ఆపై జరుగుతున్న దేమీ తెలియనట్లు, దానిలో తన ప్రమేయ మేమీ లేనట్లు— మత్తిచ్చిన మనిషిలా వుండిపోయింది.

తెల్లవార్లూ పెళ్ళి జరిగింది. తెల్లవారింది.

* * *

రాత్రి అయింది.

మల్లెలు తురిమారు.

తెల్లచీర కట్టారు.

పరమాన్నం పెట్టారు.

గదిలోకి నెట్టారు.

పైన గొళ్ళెం పెట్టారు.

సిగ్గు-చచ్చేసిగ్గు-శరీరమంతా జుగుప్సతో నింపించే సిగ్గు.

మనసును ముక్కలు చేస్తున్న సిగ్గు-

సత్య శరీరమంతా తడిసి ముద్దయి పోతోంది-

తల క్రిందకీ, కాళ్ళు పైకీ తేలిపో తున్నట్లుండింది. గది గిరగిరా తిరుగు తున్నట్టుది. దుఃఖం ఉప్పెనలా ముంచు కొస్తుంది- స్థాణువులా తలవొంచుకొని గుమ్మం దగ్గరే నిలబడిపోయింది-

అలా కొన్ని క్షణాలు గడిచాయి-

"సత్యా!" అన్న తీయని పిలుపు—

గెడ్డంపట్టి ముఖం పైకి ఎత్తుతున్న చల్లని చేతి స్పర్శ.

కాని- తాను కళ్ళెత్తి ఆ ముఖంలోకి చూడగలదా?

ఏం జరగబోతోంది? ఆదుర్దా-ఆరాటం— ఏం చెప్పాలి? ఏం చెయ్యాలి?-ప్రశ్నలు శరీరము, మనసు బిగుసుకుపోతు న్నాయి—

"సత్యా! సిగ్గుపడవలసింది నీవుకాదు నేను! కాక మా పురుష జాతి. స్త్రీ కూడా ఒక ప్రాణి అని. ఆమెకు ఆశలు, అభి రుచులు, అవసరాలు వుంటాయని. ఎంత నాగరికత పెరిగినా, ఎంత చదివినా, తెలుసు కోలేకపోతున్నాం. మన వెనక పెద్దల బుద్ధులా ఏం బాగుండటంలేదు. పిల్లలు బొమ్మలనుకుంటున్నారు. తామిష్టమొచ్చినట్లు ఆడుకోవాలను కుంటు న్నారు. దాని విషపరిణామమే ఇదంతా. పిల్లల్ని పెద్ద చదువులు చదివించి, అందుకు తగ్గ కట్నాలు రావాలని గొంతెమ్మ కోరి కలు కోరుతున్నారు. ఆ కోరికలంత సుల భంగా తీరేవి కాదు. కాబట్టి పురుషుడు సమాజంలో తనకున్న స్వేచ్ఛని దుర్విని యోగం చేసి. తన కోరికలు సరదాలు చలాగ్గా తీర్చుకుంటున్నాడు, పెళ్ళిఅయ్యే వరకు. ఆపై పెద్దలు చేసిన కటాల్ని పెళ్ళి బుద్ధిగా చేసుకుంటున్నాడు. మరి పాపం. ఆడపిల్లలు సంప్రదాయమని- కోరికలు చంపుకువి. ఎంత చదివినా, ఎంత కాలం గడిచిపోతున్నా, వ్యక్తిత్వం లేకుండా తమని తాము చంపుకు బ్రతుకు తున్నారు. అటువంటి స్త్రీలలో వ్యక్తి త్వం గలిగి. ముందంజవేసిన నిన్ను మెచ్చుకోవాలి. తప్పు స్త్రీ చేసినా, పురు షుడు చేసినా ఒకటే. ఈ రీతిగా ఆలో చించే, నిన్ను ఒప్పుకుని పెళ్ళి చేసు కున్నాను. అది మన తొలి అనుభవం అని నీకు, నాకు ఇద్దరికీ తెలుసు. ఆ తరు వాత నీకు ఏ అనుభవమైనా, ఏ అభి రుచులు, ఆశయాలువున్న-నిన్ను నిన్నుగా గౌరవిస్తాను ప్రేమిస్తాను, నువ్వు నమ్మినా నమ్మకపోయినా, నాకు మాత్రం అదే తొలి అనుభవం—"

ఇంక వినలేక పోయింది. అమాంతం వచ్చి అతని గుండెలమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆమెను తన గాఢ పరిష్వంగంలో బంధించాడు.

షష్టుకంటుకున్న ఆమె కాటుక, కారుమొ యిల్లా ఆమె కన్నీరు పన్నీరుగా అనిపించి ఎద పులకలెత్తగా ఆమెను రెండుచేతులా ఎత్తి—మంచం వైపు అడుగులు వేశాడు— బాబ్జీ అనబడే, మధు—

మత్తుగా కళ్ళు మూసుకునే—'మధూ', అంది సత్య.